క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా అరుణ్ పటేల్



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండల నూతన బీజేపీ మండల అధ్యక్షుడిగా అరుణ్ పటేల్ నియమితులయ్యారు. అరుణ్ పటేల్ బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరించి పార్టీ అభ్యున్నతి కోసం అందరిని ఏకతాటిపై తీసుకువస్తున్నాడని గుర్తించిన పార్టీ అధిష్టానం సామాన్య కార్యకర్త నుంచి బీజేపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందని ఆదివారం అరుణ్ చెప్పారు. అరుణ్ పటేల్ స్వగ్రామం డోంగ్లీ మండలంలోని మొగా. నాయకులను, కార్యకర్తలను అందరిని కలుపుకోని ముందుకు సాగుతామని రానున్న ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ఆయన అన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

భిక్కనూరు: జంగంపల్లిలో ఉన్న దాసంజానేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన అత్తెల్లి స్వామి రూ.5 వేలను ఆదివారం విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా దాతను ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆలయాన్ని పునర్నిర్మించేందుకు గ్రామస్తుల సహకారంతో విరాళాలను సేకరిస్తున్నామని సభ్యులు తెలిపారు.

జాతీయ విద్యా సదస్సులో జిల్లా తపస్ సభ్యులు



భిక్కనూరు: రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో జరుగుతున్న జాతీయ విద్యా సదస్సులో కామారెడ్డి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ప్రతినిధులు ఆదివారం పాల్గొన్నారు. తపస్ జిల్లా అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి భూనేకర్ సంతోష్, కో-కన్వీనర్ భాస్కరాచారి, జిల్లా ఉపాధ్యక్షులు వేద్‌ప్రకాశ్, రచ్చ శివకాంత్‌లు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతీయ సదస్సులో జాతీయ విద్యావిధానం ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించనున్నారు. అలాగే విద్యా రంగంలో నూతన ఆవిష్కరణలు, సీపీఎస్ రద్దు, విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలపై పలు తీర్మానాలను ఆమోదించనున్నట్లు జిల్లా తపస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి వివరించారు.

కోతకు గురవుతున్న వంతెన పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి పాములవాగు, పెద్దవాగు ప్రవహిస్తున్నాయి. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి లింగంపల్లి పాములవాగు, నాగారం కాసులకత్త వంతెనల వద్ద వరద నీటికి వంతెనలకు ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయింది. అధికారులు తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించారు. తిరిగి ఆదివారం భారీ వర్షం కురియడంతో పాములవాగు, పెద్దవాగు వరద నీటితో ప్రవహించాయి. దాంతో వంతెనల వద్ద తాత్కాలికంగా వేసిన మొరం కోతకు గురయ్యింది. పాములవాగు వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు వేస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డు కోతకు గురవుతుండడంతో ఎంపీడీవో పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ఎంపీవో మలహరి ఉన్నారు.

నగదు పురస్కారాల అందజేత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిర్మన్‌పల్లిలో దసరా ఉత్సవాల్లో భాగంగా టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మార బాల్‌రెడ్డి నగదు పురస్కారాలను అందజేశారు. టెన్త్‌లో మార రిశ్వంత్ రెడ్డి, శ్రీజ, ఇంటర్‌లో శ్రీజారెడ్డి, సాకలి అర్చనలకు నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ ముదుపు బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ భైరవరెడ్డి, వీడీసీ చైర్మన్ బాల్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

12న రాష్ట్ర సేవికా సమితి విజయదశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: రాష్ట్ర సేవికా సమితి జిల్లా విజయ దశమి సార్వజనికోత్సవం ఈ నెల 12న ఆదివారం సాయంత్రం 5 గంటలకు కామారెడ్డి సరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. వక్తగా రాష్ట్ర సేవికా సమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

అద్దె భవనంలో ఎస్సీ బాలుర హాస్టల్

- సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- నూతన భవన నిర్మాణానికి మంజూరు కాని నిధులు



అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్



శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర హాస్టల్ భవనం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సొంత భవన నిర్మాణానికి సరిపడా స్థలం ఉన్నా ప్రభుత్వం నూతన భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించకపోవడంతో ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులు అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌కు సంబంధించిన భవనం శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారులు దానిని కూల్చివేయాలని సూచించారు. హాస్టల్ భవనాన్ని కూల్చడానికి గానీ నూతన భవన నిర్మాణానికి నిధులు లేకపోవడంతో అధికారులు విద్యార్థులను రెండేళ్ల నుంచి అద్దె భవనంలోకి మార్చి హాస్టల్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో 67 మంది విద్యార్థులు ఉన్నారు. సరిపడా గదులు లేకపోవడంతో విద్యార్థులు అరకొర వసతుల మధ్యే చదువులు కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులను మంజూరయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఎస్సీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రస్తుతం అద్దె భవనంలో హాస్టల్ కొనసాగుతున్నది. నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.
– కృష్ణ, వార్డెన్, ఎస్సీ హాస్టల్, ఎల్లారెడ్డి

చాలా ఇబ్బందులున్నాయి



అద్దె భవనంలో హాస్టల్ కొనసాగుతుండడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సరిపడా బాత్‌రూంలు, టాయిలెట్లు లేవు. ఉన్న స్థలంలోనే అడ్జెస్టు కావాల్సి వస్తోంది.
– గణేష్, 8వ తరగతి, ఎస్సీ హాస్టల్, ఎల్లారెడ్డి

నూతన భవనం నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలి. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. గత రెండేళ్ల నుంచి అద్దె భవనంలో ఉంటున్నాం.
– తరుణ్, 10వ తరగతి, ఎస్సీ హాస్టల్, ఎల్లారెడ్డి

అన్ని మంచాలు ఒకే దగ్గర..



అన్ని మంచాలు ఒకే చోట ఉండడంతో పైకి ఎక్కేందుకు, దిగేందుకు ఇబ్బందిగా ఉంది. సరిపడా స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.
– సాయిప్రసాద్, 7వ తరగతి, ఎస్సీ హాస్టల్, ఎల్లారెడ్డి

రిటైనింగ్ వాల్ నిర్మించాలి



కొండపై నుంచి జారిపడిన మట్టి, చెట్లు

బాన్సువాడ రూరల్: జక్కల్‌దాని తండా నుంచి గాంధారి మండలం మొండిసడక్ వరకు ఉన్న సింగిల్ రోడ్డును 2018లో రూ.11 కోట్ల నిధులతో డబుల్ రోడ్డుగా విస్తరించారు. 2.3 కిలోమీటర్ల మేర అడ్డదిడ్డంగా ఉన్న రోడ్డును మూలమలుపులు లేకుండా కొండలను భారీయంత్రాలతో తొలిచి విస్తరించారు. ఈక్రమంలో పలుచోట్ల రోడ్డుకు అనుకుని ఓవైపు పెద్ద కొండలు ఉన్నాయి. భారీవర్షాలు కురిసినపుడల్లా కొండచరియలు విరిగి పెద్ద పెద్ద చెట్లు, మట్టి.. రోడ్డు పైకి వచ్చి చేరుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు విస్తరణ సమయంలో ఓవైపు రిటైనింగ్‌వాల్ నిర్మిస్తామని చెప్పిన అధికారులు 7 ఏళ్లు పూర్తయినా ఊసెత్తడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి ప్రమాదకరంగా ఉన్న చోట్ల రిటైనింగ్‌వాల్ ఏర్పాటు చేయాలని గట్టుమీది గ్రామాల ప్రజలతో పాటు ఈరోడ్డు గుండా నిత్యం ప్రయాణించే వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి అన్నారు. ఎండ్రియాల్‌లో గ్రామానికి చెందిన గుండ్రెడ్డి పద్మ–మధుసూదన్‌రెడ్డి నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హాజరయ్యారు. ఈ ఇందిరమ్మ ఇల్లు పథకం నిరుపేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, మిగతా లబ్ధిదారులు కూడా త్వరగా తమ ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు. పార్టీ అధికార ప్రతినిధి షౌకత్‌అలీ, నాయకులు సుధాకర్‌రావు, జలంధర్ రెడ్డి, శ్రీకాంత్, సంజీవులు, . దశరత్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం



బాన్సువాడ రూరల్: నాగారంలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన పనులు నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిన పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతోంది. భవనం పైపెచ్చులు ఊడిపడుతున్నాయని అంగన్ వాడీ కార్యకర్త వాపోయారు. వర్షాలు పడినపుడు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాతభవనంలోకి రావడానికి భయపడుతున్నారు. నూతన భవనంలో డోర్లు, కలర్, ర్యాంపు నిర్మాణ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయించి నూతన భవనాన్ని చిన్నారులకు అందుబాటులో తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దేశ సేవ కోసం యువత ముందుకు రావాలి



పిట్లంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



తాడ్వాయి మండల కేంద్రంలో..

సాక్షి నెట్‌వర్క్: ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు, పట్టణాల్లో ఆదివారం విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. దేశ సేవకోసం యువత ముందుకు రావాలన్నారు. పాశ్చాత్య మోజులో పడకుండా ప్రజలంతా సంస్కృతీసంప్రదాయాలను పాటించాలన్నారు. పలు చోట్ల ర్యాలీలు చేపట్టారు.



బీర్కూర్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ వక్తలు



తిర్మలాపూర్‌లో..



తిప్పాపూర్‌లో..

నేడు ఎల్లారెడ్డిలో ఆర్‌ఎస్‌ఎస్ ఉత్సవాలు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నేడు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పట్టణంలోని వైశ్యభవన్‌లో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

చిత్తడిగా మారిన వీక్లీ మార్కెట్



ఎల్లారెడ్డిరూరల్: వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలో భారీ వర్షం కురవడంతో పట్టణంలోని వీక్లీ మార్కెట్ బురదమయంగా మారింది. దీంతో మార్కెట్‌కు వచ్చిన జనాలు బురదలోంచి నడిచి కొనేందుకు ఇబ్బందులు పడ్డారు.

కంపుకొడుతున్నా పట్టించుకోరా..?



డోంగ్లీలో రోడ్డుపై పారుతున్న మురికి

మద్నూర్(జుక్కల్): తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని నాయకులు పేర్కొంటున్నా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారి కాలనీలు కంపుకొడుతున్నాయి. డోంగ్లీ మండల కేంద్రంలో పలు కాలనీల్లో మురికి కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీరు కొన్ని నెలలుగా రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతున్నా స్పందించేవారు కరువయ్యారని స్థానికులు చెబున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది రోగాలకు కారణమవుతున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటివృథాను అరికట్టరూ..!



బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు రేణుకా ఎల్లమ్మ డబుల్‌బెడ్‌రూం కాలనీ ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరుబావి నీరు ఇలా వృథాగా పోతున్నాయి. అటు అధికారులకు కానీ, ఇటు కాలనీవాసులకు కాని పట్టింపు లేకపోవడంతో విలువైన భూగర్భ జలాలు వృథా అవుతున్నాయి. అవసరం మేరకు వాడుకుని నిలిపి వేయకపోవడంతో అటు నీటితో పాటు విద్యుత్ వృథా అవుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి బోరుబావి నీటి విడుదల కోసం నిర్ణీత సమయం కేటాయించి మిగిలిన సమయంలో తాళం వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భగీరథ నీరు బురదమయం



బాన్సువాడ రూరల్: బోర్లంలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు బురదమయంగా ఉంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు పలుమార్లు సూచించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. పేదలు మిషన్ భగీరథ నీటినే తాగుతారని, ఇలాంటి కలుషిత నీరు తాగడం వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని భయాందోళనలకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్ లైన్ లీకేజీలను అరికట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు, కార్యకర్తలు



తాడ్వాయిలో.. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి



బీబీపేటలో.. అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి

రాజంపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాలని ఎన్నికల ఇన్చార్జి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శివాయిపల్లి రెడ్డి ఫంక్షన్ హాలులో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు సావుసాని సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి జెడ్పీటీసీతో ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ పదవులను కైవసం చేసుకోవాలని సూచించారు. అలాగే టికెట్ ఎవరికి వచ్చినా అందరూ సమిష్టిగా కృషిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): త్వరలో గ్రామాలలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, కామారెడ్డి మాజీ కౌన్సిలర్ ఆకుల భరత్, నాయకులు మర్రి బాపురెడ్డి, లింగారావు, హోటల్ శ్రీను, వెంకట్‌రావు, నర్సింలు, చైతన్యగౌడ్, బాలాజీ, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేతలు సత్తా చాటాలి

బీబీపేట: స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హాలులో మండల అధ్యక్షుడు అల్లం ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రతి గ్రామంలో స్థానాలకు బీజేపీ అభ్యర్థులు కచ్చితంగా పోటీ చేయాలని దిశా నిర్దేశం చేశారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి


బిచ్కుంద(జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని బాన్సువాడ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బిచ్కుందలో బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. అభ్యర్థులు ప్రచారంలో ముందుండాలని కోరారు. మండల అధ్యక్షుడు విష్ణు, గంగారాం, పీరాజి, మల్లికార్జున్ దేశాయి, పండరి జాదవ్ పాల్గొన్నారు.

భిక్కనూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి జెండా రెపరెపలాడించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి తిర్మలేష్, నేతలు పొన్నాల రంజిత్ రెడ్డి, రమేష్‌రెడ్డి, సాయిలు, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



గాంధారి శివారులో వ్యవసాయ బావుల వద్ద వంగిన స్తంభాలు



గాంధారి శివారులో మరో చేనులో..

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి శివారులో వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ స్తంభాలు పక్కకు వంగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కింద పడిపోతాయోనని సంబంధిత రైతులు భయపడుతున్నారు. స్తంభాలను సరిచేయాలని ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. గాంధారి–కామారెడ్డి ప్రదాన రహదారి పక్కనే గల వ్యవసాయ బావుల వద్ద ఈ పరిస్థితి ఉంది.

ప్రమాదం జరుగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికకు కసరత్తు



హన్మాజీపేట్ కాంగ్రెస్ ఎంపీటీసీ అభ్యర్థి సంజీవ్‌తో రవీందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పాటు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. కాగా బాన్సువాడ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఏనుగు రవీందర్‌రెడ్డి స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. హన్మాజీపేట్‌లో పాత కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమై ఎంపీటీసీ అభ్యర్థిగా రంగరిగారి సంజీవులును ప్రకటించారు. అలాగే ఇతర గ్రామాల్లోనూ సీనియర్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థుల ఎంపిక కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో ఇంతకు కాంగ్రెస్ పార్టీ బి–ఫాం ఎవరికి దక్కుతుందో అని సర్వత్ర చర్చించుకుంటున్నారు.

భారీవర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భారీవర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో లలితకుమారి సూచించారు. బెజుగంచెరువుతండా, పల్లెబోగుడతండాను ఆదివారం ఎంపీవో ప్రభాకరచారితో కలిసి ఆమె సందర్శించారు. కాగా ఇటీవల కురిసిన భారీవర్షాలతో బెజుగంచెరువుతండాకు వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు దెబ్బతిని తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో దెబ్బతిన్న కల్వర్టుకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మళ్లీ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కల్వర్టు అంచులకు ఎవరూ వెళ్లకూడదని తండావాసులకు ఎంపీడీవో సూచించారు. పంచాయతీ కార్యదర్శి అనిత, తాండూర్ సొసైటీ డైరెక్టర్ కిషన్‌నాయక్, తండావాసులున్నారు.